# గురువును మించిన శిష్యుడు

"నిన్న ఓ సంగతి అడగాలని వానాళ్ళ బట్టి అనుకుంటున్నా. ఏమీ అనుకోరు కదూ గురూజీ" అన్నాడు వైకుంఠం.

"నా కలాంటి అనుకోవడాలు ఇంటా వంటా లేవు. నిర్భయంగా అడుగు శిష్యా" అన్నాడు వజ్రపాణి

కొంత సందేహిస్తూ "అప్పుడప్పుడు కొత్త కొత్త అమ్మాయిలతో కనిపిస్తూ వుంటావు. ఈ ప్రియురాళ్లు నీ కెక్కడ చిక్కుతారు. వార్ని ఎలా బుట్టలో వేస్తావు ఆ కిటుకేదో నాకూ చెప్పి పుణ్యం కట్టుకోండి గురూజీ" అన్నాడు వైకుంఠం.

గతుక్కుమని ఫీలౌతూ "అయితే నీ కంట్లో పడ్డానన్నమాట! అయినా నీకప్పుడే ఎందుకు వాళ్ళ జోలి. జీవితం కొన్నాళ్ళు సాగనీవోయ్ ఈ మధ్యనే గదా లాగులు విడిచి ప్యాంట్లు వేస్తున్నావు" అన్నాడు వజ్రపాణి బెట్టుగా.

"అమ్మ....మ్మ మీరలా అంటే ఉరి పోసుకు ఛస్తా. కొత్త కొత్త అనుభవాలకై, అనుభూతులకై ఆరాటపడుతున్నది వయస్సు. అగడం చేస్తున్నది మనస్సు. మీ దారిలో నడచి మీ ప్రతిభా విశేషాల్ని నిలబెట్టి మీ శిష్యకోటిలో పేరు తెచ్చుకుందామని ఉబలాటంగా వుంది గురూ" అన్నాడు వైకుంఠం.

"అమ్మాయిల అభిమానం సంపాదించాలంటే మాటలటోయ్! చెట్టు నున్న కాయా కోసుకోవడానికి! ఎంతో నేర్పూ ఓర్పూ వుండాలబ్బాయ్! దిగితేకాని లోతు తెలియదులే! ముందసలు గురుదక్షిణ ఏమిస్తావో చెప్పు?" అన్నాడు వజ్రపాణి సిగరెట్ కోసం జేబు తడుముకుంటూ.

వైకుంఠం తన జేబులోంచి సిగరెట్ తీసి గురువుగారి నోటికి అందించి వెలిగించాడు.

"అడ్వాన్స్‌గా 'క్వాలిటీ' లో విందు ఆ పైన మీరేది అడిగితే అదీ! మీ కు అడ్డం ఏముంది గురువుగారూ" అన్నాడు వైకుంఠం.

రైలింజనులా సిగరెట్ పొగ వదలి "మన నగరంలో షటిల్ సర్వీసున్నట్లు నీకు తెలిసే వుంటుంది" అన్నాడు వజ్రపాణి.

"సికింద్రాబాద్ నుండి షంషాబాద్ వరకూ వుంది కదా! అయినా మన బిజినెస్‌కి దానికి ఏంటి లంకె? గోకులాష్టమికీ షేక్ హుసేన్‌కి ఉన్నట్టు!" అన్నాడు వైకుంఠం.

"తొందరపడుతున్నావు శిష్యా! నే చెప్పేది చెవిఒగ్గి విను! పదిగంటల తరువాత రాత్రిపూట డబీర్‌పురా రైల్వే స్టేషనుకు వెళ్లు. ఆఖరుబండికి కొందరమ్మాయిలు దిగుతూ వుంటారు. వాళ్ళనింటికి తీసుకెళ్ళడానికి ఏ మొగుళ్లో, మొద్దులో వస్తుంటారు అలాంటివాళ్లు కొందరికి ఒక్కోసారి రారు. టైంకి మిస్ అవుతుంటారు. బిక్కు బిక్కుమంటూ ఒంటరిగా నిలబడి నేలచూపులు చూస్తూ మగసహాయంకోసం చూస్తూవుంటారు. నువ్వు నెమ్మదిగా అలా అలా వెళ్ళి నోట్లో వేలుపెట్టుకుని చీక్కునే బుజ్జిబాబులా ప్రపంచంలోని అమాయకత అంతా నీ మొహంలోకి తెచ్చిపెట్టుకొని వాటికి నమ్మకం కలిగించి తోడుగా వెళ్ళి యింటిదగ్గర దిగబెడుతూ వుండు. ఎప్పుడో ఒకప్పుడు ఎవరో ఒకరు కళ్లెత్తి చూడకపోరు. కత్తు కలపకపోరు. పొత్తుకుదర్చకపోరు" అన్నాడు వజ్రపాణి వేదమంత్రం ఉపదేశిస్తున్నట్లు పోజు పెడుతూ.

"ఓహో! తిరకాసు తెలిసింది" అన్నాడు తేలిగ్గా.

"అనుకున్నంత తేలిక్కాదోయ్ వెర్రి వెంగళప్పా! వ్యవహారం బెడిసి కొట్టకుండా చూసుకోవాలి. పీపుసాపు కాకుండా కాపాడుకోవాలి. అందుకే అనుభవం ఉండాలంటాను. పెద్దంలేటి పిల్లల్ని ఓ కంట కనిపెడుతూ ఉండు. తొందరపడితే రసాభాసా అవుతుంది. ఏ నాసిరకందాన్నో చూస్తే దోకొచ్చేదాన్నో ముందు కాస్త కదిపి చూస్తూ మెలమెల్లగ గ్రేడ్ పెంచాలి తెలిసిందా! కుర్రకుంక లకేం తెల్సు ఈ సాధక బాధకాలు. అమ్మాయి నవ్వితే చాలు వాళ్ళో పడిందనుకుంటారు! ఇదేమన్నా క్వాలిటీలో కోడికాలుతిన్నట్లు అనుకున్నావా?" అన్నాడు వజ్రపాణి.

"చూసోక్కో గురూ నా తడాఖా! వజ్రపాణి శిష్యుడంటే ఏమిటో నీకే తెలుస్తుంది. రేపీపాటికి ఏ పిట్టనో పట్టి నా మజాకా చూపిస్తా! ఓ....కె.... క్వాలిటీకి పద" అన్నాడు వైకుంఠం.

ఆ రాత్రే వైకుంఠం అమ్మాయిల వేటకై కొత్త పెళ్ళికొడుకులా ముస్తాబయ్యాడు. వాళ్ళ నాన్న పెళ్ళికోటు తీసి దుమ్ము దులిపి ఇస్త్రీ చేయించి వేసుకొన్నాడు. ఆ కోటు విలువ దారలతో కొట్టొచ్చేట్టుగా ఉండటమే దానికి కారణం. కాలినడకన బయలుదేరాడు. దారిలో యాకత్‌పురా స్టేషను కనబడింది. టైము చూసుకొంటే పదిదాటింది. డబీర్‌పురాలో దిగేవాళ్ళుంటే ఇక్కడ మాత్రం దిగకుండా వుంటారా ఏంటి. ఈ వాల్టికి ఇక్కడే బోణీకొడదామనుకొని గబగబా స్టేషన్‌లోకి దూరబడ్డాడు.

---

కొల్లుకుదురు రాజశేఖరరెడ్డి

---

మరో అయిదు నిముషాల్లో రైల్లో చ్చింది. వైకుంఠం తల దువ్వుకొని కోటు సరిచేసుకొని అమాయకుడిలా మొహంపెట్టుకొని ప్లాట్ ఫారంపై నిలబడి తనకు రాసిపెట్టివున్న రమణికోసం చూస్తూవున్నాడు. బోలెడంతమంది అమ్మాయిలు దిగారు. అయితే రక్షకభటుల్లా మొగుళ్ళు కామోసు వాళ్లను చుట్టేసుకొని బయటకు నడిచారు. తన రాత సున్నా అయినందుకు హతోస్మి అనుకొంటూ వైకుంఠం ప్లాట్ ఫారం అంతా సెర్చి చేశాడు. ఓ మూల బిక్కుబిక్కుమంటూ నేలచూపులు చూస్తూ నిలబడివుంది ఒక అమ్మాయి. మధ్య మధ్యలో తల ఎత్తి ఎవరికోసమో తెగ ఎదురుచూస్తుంది. గాభరా పడుతున్నట్లు వైకుంఠం పసికట్టి తూనీగలా రివ్వున అటుకేసి పోయాడు.

గురువుగారి హితబోధ గుర్తుచేసుకొని బాణం విసిరాడు. లేచిన వేళా విశేష ప్రభావం. వైకుంఠం ఆ అమ్మాయికి నమ్మకం కలిగించాడు. నక్కను తొక్కినట్లు మురిసిపోతూ ఉబ్బిపోయాడు. ఎలాగైతేనేం ఆ అమ్మాయిని వెంట బెట్టుకొని బయటకు నడిచాడు. భూమ్మీద నడుస్తున్నట్లుగాలేదు ఆకాశంమీద ఎగురుతున్నట్లుగా వుంది వైకుంఠానికి. కారణమేమిటంటే ఆ అమ్మాయి అందగత్తె. పెద్దింటి ఆడపడచులావుంది. ఇక ఆ అమ్మాయితో ముందు ముందు చేయబోయే శ్రీకృష్ణలీలలూ. సినిమాహాళ్ళూ, హోటళ్ళూ అన్నీ వైకుంఠంలో గిర్రున తిరిగాయి.

"తలనొప్పితో వస్తున్నానండీ! ఆ కనబడే ఇరానీ హోటల్లో ఒక చాయ్ తాగొస్తాము. అభ్యంతరంలేకపోతే మీరూ రండి" అన్నాడు వినయంగా.

"సరే పదండి" అంది అమ్మాయి తప్పించుకోలేక.

టీ తాగి యిద్దరూ బైటకొచ్చారు. కొంతదూరంపోయాక అదాటుగా ఒకాయన ఎవరినో వెతుక్కుంటూ వస్తూ వుండటం చూశారు. ఆ అమ్మాయి కళ్ళు మెరిశాయి. అతడు దగ్గరకు రాగానే "ఈ అబ్బాయి లేకపోతే నా గతి ఏమయ్యేదో! సమయానికి తోడు దొరికాడు. లేకపోతే ఆ తుప్పల్లోబడి ఒంటరిగా యింటికి రావల్సివచ్చేది. మీ రెప్పుడూ యింతే అనుకొన్న టైంకి రారు" అంది కోపంగా చూస్తూ.

ఆతగాడు ఆ అమ్మాయి భర్త.

"శిష్యకోటిని బయటకు పంపేసరికి ఈ వేళయింది. దారిమధ్యలో దగుల్బాజీ వెధవొకడు తగులుకొని తోమి వదిలాడు అలిమేలూ" అని వైకుంఠానికి థాంక్స్ చెపుతూ గుడ్డివెలుగులో తేరిపారజూశాడు. వైకుంఠాన్ని చూసి తేలుకుట్టినట్లు ఉలిక్కిపడి "ఓరి నీ తాడు తెగ! నిన్ను దబీర్ పురా స్టేషనుకు పొమ్మంటే యాకుత్ పురాకు వచ్చావా!" అన్నాడు వజ్రపాణి కంగుతిన్నట్టు.